రూ.2 లక్షల లంచం డిమాండ్..

ఏసీబీ వలలో రంగారెడ్డి డీఎంహెచ్‌వో. ఫిజియోథెరపీ సెంటర్ తాళాలు అప్పగించేందుకు రూ.లక్ష స్వీకరణ.. ముగ్గురి అరెస్ట్

దశ, రంగారెడ్డి: ఫిజియోథెరపీ సెంటర్‌ను తిరిగి తెరవడంతో పాటు లైసెన్స్ జారీ చేసేందుకు లంచం డిమాండ్ చేసిన వ్యవహారంలో రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో) స్వర్ణకుమారి, హెల్త్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాస్, ప్రైవేట్ డ్రైవర్ మద్దూరికృష్ణయ్యలను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు సోమవారం పట్టుకున్నారు. ఏసీబీ అధికారుల ప్రకారం.. లైసెన్స్ లేకుండా నిర్వహిస్తున్నారనే కారణంతో స్వాధీనం చేసుకున్న ఫిజియోథెరపీ సెంటర్ తాళాలను తిరిగి అప్పగించడంతో పాటు, తదుపరి చర్యలు తీసుకోకుండా ఉండేందుకు మరియు కొత్త డీఎంహెచ్‌వో లైసెన్స్ జారీ చేసేందుకు రూ.2 లక్షలు లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందులో భాగంగా రూ.1 లక్ష తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. లంచం మొత్తాన్ని ప్రైవేట్ డ్రైవర్ మద్దూరికృష్ణయ్య వద్ద నుంచి ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో డీఎంహెచ్‌వో, హెల్త్ ఇన్‌స్పెక్టర్, డ్రైవర్ పాత్రపై దర్యాప్తు కొనసాగుతోంది. ముగ్గురినీ నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఏసీబీ వెల్లడించింది.



ఉగ్రవాదుల చేతిలో 'లోరా'..



జమ్మూకశ్మీర్ అడవుల్లో ఉగ్రవాదుల ఏరివేతకు ప్రయత్నిస్తోన్న భద్రతా బలగాలకు కొత్త సవాల్ ఎదురైంది. సైన్యం కంట పడకుండా ఉండేందుకు ఉగ్రవాదులు ఓ సరికొత్త ఫోన్ నెట్‌వర్క్‌ను వినియోగిస్తున్నట్లు తెలిసింది. అదే 'లోరా లాంగ్ రేంజ్, లో పవర్' ఆయుధం. ఎలాంటి సిమ్ కార్డు, మొబైల్ టవర్, వైఫై అవసరం లేని ఈ నెట్‌వర్క్‌ను (LoRa) గుర్తించడం భద్రతా బలగాలకు (Security Forces) అసాధ్యంగా మారుతోందని సెక్యూరిటీ ఏజెన్సీ వర్గాలు చెబుతున్నాయి.

మూసా ఎన్‌కౌంటర్‌తో..

జమ్మూకశ్మీర్‌లోని బడ్గాం జిల్లాలో ఇటీవల లష్కరే తయ్యిబా చీఫ్ ఆపరేషనల్ కమాండర్ మహమ్మద్ ఆసిఫ్ అలియాస్ హాషిం మూసాను భద్రతా బలగాలు మట్టుబెట్టిన సంగతి తెలిసిందే. అతడి మృతదేహం వద్ద ఓ ఎలక్ట్రానిక్ పరికరం లభించింది. అది స్మార్ట్‌ఫోన్ కాదని, 'లోరా అల్ట్రా' పేరుతో ఉన్న డివైజ్ అని ఓ భద్రతా అధికారి వెల్లడించారు. ''ఇది సాధారణ వాకీటాకీ కాదు. ఎన్‌క్రిప్ట్ చేసిన వైర్‌లెస్ కమ్యూనికేషన్ డివైజ్. ఒక్కో హ్యాండ్‌సెట్ స్వయంగా టవర్‌లా కూడా పనిచేస్తుంది. దీనికి సిమ్ కార్డు అక్కర్లేదు. రీఛార్జ్ చేయనవసరం లేదు'' అని సదరు అధికారి వివరించారు.

కిలోమీటర్ల దూరానికి కమ్యూనికేషన్..

ఈ 'లోరా' డివైజ్‌లు.. తక్కువ శక్తి గల రేడియో ఫ్రీక్వెన్సీని ఉపయోగించుకుని 1015 కిలోమీటర్ల దూరంలో ఉన్న డివైజ్‌లకు టెక్స్ట్ మెసేజ్‌లు, జీపీఎస్ లొకేషన్లు, అత్యవసర అలర్ట్‌లను పంపించగలవు. రేడియో సిగ్నల్స్‌పై ఆధారపడే ఈ డివైజ్‌లతో ఉగ్రవాదులు దట్టమైన అడవుల్లో ఓ ప్రైవేట్ నెట్‌వర్క్‌ను సృష్టించుకున్నారని భద్రతా అధికారులు తెలిపారు. అందువల్ల సాధారణ ట్రాకింగ్ వ్యవస్థలకు ఇవి చిక్కట్లేదని పేర్కొన్నారు. వీటి సాయంతోనే కశ్మీర్ అడవుల నుంచి ఉగ్రవాదులు నియంత్రణరేఖకు ఆవల ఉన్న తమ పెద్దలతో సంభాషణలు సాగిస్తున్నట్లు తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఎత్తైన కొండల ప్రాంతాల్లో భద్రతా సిబ్బంది 'ఆపరేషన్ మహదేవ్'ను చేపట్టిన సంగతి తెలిసిందే. అందులో పలువురు ఉగ్రవాదులను మట్టుబెట్టగా.. ఘటనాస్థలాల్లో ఎన్‌క్రిప్టెడ్ లోరా పరికరాలు, సిమ్ రహిత బర్నర్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

పాక్‌చైనా లింక్..?

ఈ డివైజ్‌లను నేషనల్ టెక్నికల్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ తనిఖీ చేయగా కీలక విషయాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. ''వీటిని మన దేశంలో అసెంబ్లింగ్ చేసినట్లు కన్పించడం లేదు. వీటిని ముందుగానే ఎన్‌క్రిప్ట్ చేసి, కాన్ఫిగర్ చేశారు. పాక్ నుంచి వీటిని మన దేశంలోకి పంపిస్తున్నట్లుగా అనిపిస్తోంది. దీని వెనుక చైనా టెక్నాలజీ సాయం ఉండొచ్చు'' అని భద్రతా సిబ్బంది అనుమానిస్తున్నారు. ఈ డివైజ్‌లను గుర్తించేందుకు భద్రతా బలగాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. స్పెక్ట్రమ్ స్కాన్లర్లు, జామర్లను ఉపయోగించి లోరా రేడియో ఫ్రీక్వెన్సీలను కనుగొనేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు వెల్లడించారు.

కాసులు కురిపిస్తున్న బోడ కాకరకాయలు

కిలో రూ.200.. రోజుకు రూ.2 వేల వరకు.. మూడు నెలల సీజన్.. మంచి డిమాండ్

రుచితో పాటు పోషకాలు.. అడవిపై ఆధారపడిన కుటుంబాలకు ఆదాయం



దశ, ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లాలో బోడ కాకరకాయలకు ఈ సీజన్‌లో మంచి డిమాండ్ ఏర్పడింది. వర్షాలు కురుస్తుండటంతో అటవీ ప్రాంతాల్లో విరివిగా లభిస్తున్న బోడ కాకరకాయలు ఇప్పుడు మార్కెట్లలో కాసులు కురిపిస్తున్నాయి. రైతుబజార్‌తో పాటు రోడ్ల పక్కన ఫుట్‌పాత్‌లపై కూడా వీటి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. జిల్లాలోని భీంపూర్, జైనథ్, బేల, తలమడుగు, తాంసి, ఆదిలాబాద్ రూరల్ మండలాలతో పాటు ఉట్నూర్ ఏజెన్సీ, కవ్వాల్ అటవీ ప్రాంతాల్లో బోడ కాకర ఎక్కువగా లభిస్తుంది. మహారాష్ట్ర సరిహద్దులోని కిన్వట్, మాండ్వి, బోరీ, పాండ్రకవడ, ఘాటంజి ప్రాంతాల నుంచి కూడా స్థానికులు వీటిని సేకరించి ఆదిలాబాద్ మార్కెట్‌కు తీసుకొస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో బోడ కాకరకాయ కిలో రూ.200 వరకు ధర పలుకుతోంది. అడవుల్లో తెల్లవారుజామునే వెళ్లి చెట్ల పొదలు, తీగల నుంచి వీటిని సేకరిస్తున్నారు. విష కీటకాలు, ముళ్ల పొదల మధ్య కష్టపడి కాకరకాయలను తెంపి మార్కెట్‌కు తీసుకొస్తున్నామని సేకరణదారులు చెబుతున్నారు. ఒక్కొక్కరు రోజుకు రూ.వెయ్యి నుంచి రూ.2 వేల వరకు అమ్మకాలు జరుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. బోడ కాకర సాధారణంగా జూలై నుంచి సెప్టెంబర్ వరకు మాత్రమే లభిస్తుంది. శ్రావణమాసం నేపథ్యంలో చాలామంది మాంసాహారానికి దూరంగా ఉండటంతో ఈ కూరగాయకు మరింత డిమాండ్ పెరిగింది. ఆగాకర, బొంత కాకర, అడవి కాకర పేర్లతో కూడా పిలిచే వీటిని మరాఠీలో 'కర్టులే', హిందీలో 'కంటోలా' అని అంటారు. సాధారణ కాకరకాయతో పోలిస్తే చిన్నగా, ముళ్లలాంటి పైపొరతో కనిపించే బోడ కాకరలో పీచు, విటమిన్ ఏ, సీ, కే, పొటాషియం, మెగ్నీషియం, జింక్ వంటి పోషకాలు ఉంటాయి. ఫైబర్ జీర్ణవ్యవస్థకు తోడ్పడుతుంది. తక్కువ కేలరీలు ఉండటంతో సమతుల్య ఆహారంలో భాగంగా తీసుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. అయితే ఏదైనా ఆరోగ్య సమస్యకు ఇది మందుగా భావించకుండా, మితంగా తీసుకోవడం మంచిది. బోడ కాకర సేకరణ ఆదిలాబాద్ అటవీ ప్రాంతాల్లో నివసించే పలువురు కుటుంబాలకు సీజనల్ ఉపాధిగా మారింది. వర్షాకాలంలో మాత్రమే లభించే ఈ కూరగాయలను సేకరించి విక్రయించడం ద్వారా వచ్చే ఆదాయం కుటుంబ అవసరాలకు ఉపయోగపడుతోంది. ఈ సీజన్ ముగిసేలోపు మరికొన్ని వారాల పాటు బోడ కాకర విక్రయాలు కొనసాగనున్నాయి.

వ్యభిచార ముఠా అరెస్టు

దశ, కూకట్ పల్లి: కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధి భాగ్య నగర్ కాలనీలో గత రాత్రి రెండు ఓయో హోటళ్లలో వ్యభిచార కార్యకలాపాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. 12మందిని గుర్తించిన పోలీసులు.. 11మందిని అరెస్టు చేసారు. ఆరుగురు నిర్వాహకులు, నలుగురు వినియోగదారులు, ఇద్దరు మహిళలుగా గుర్తించారు. యజమాని పరారీలో వున్నాడు. నిందితుడి కోసం పోలీసుల గాలింపు కొనసాగుతోంది. 7 స్మార్ట్‌ఫోన్లు, 2 వాడిన కండోమ్లు, 4 వాడని కండోమ్లు స్వాధీనం చేసుకున్నారు.

భూములకు మళ్లీ భారీ డిమాండ్..

దశ, హైదరాబాద్: హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో ప్రైమ్ ల్యాండ్‌కు ఉన్న డిమాండ్ మరోసారి స్పష్టమవుతోంది. రాయదుర్గం భూముల ఈవేలంలో ఎకరం ఏకంగా రూ.264 కోట్ల ఆల్‌టైమ్ రికార్డు ధర పలకడంతో ఊపుమీదున్న హెచ్ఎండీఏ.. నగరంలోని మరికొన్ని కీలక భూములను మరోసారి వేలానికి సిద్ధం చేసింది. ప్రభుత్వ భూముల విక్రయంతో భారీ ఆదాయం సమీకరించడంతో పాటు, స్పష్టమైన టైటిల్స్ ఉన్న భూములను మార్కెట్‌లోకి తీసుకురావడమే లక్ష్యంగా ఈవేలం నిర్వహించనుంది. కోకాపేట్ నియోపోలిస్‌లోని ప్లాట్ నంబర్ 17కు చెందిన 4.59 ఎకరాల భూమిని రీఆక్షన్ చేయనున్నారు. దీనికి ఎకరానికి రూ.120 కోట్ల అప్‌సెట్ ధర నిర్ణయించడంతో రియల్ ఎస్టేట్ వర్గాల దృష్టి మరోసారి కోకాపేట్‌పై పడింది. గోల్డెన్ మైల్‌లోని 0.70 ఎకరాల స్థలానికి ఎకరానికి రూ.70 కోట్ల అప్‌సెట్ ధర నిర్ణయించారు. ఈ రెండు భూముల వేలంతో మరోసారి భారీ బిడ్డింగ్ జరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇక సొంతింటి స్థలం కొనుగోలు చేయాలనుకునే వారిని దృష్టిలో ఉంచుకుని మోకిల, బాచుపల్లి, ఇన్ముల్‌నర్వ ప్రాంతాల్లోని లేఅవుట్లను కూడా వేలానికి తీసుకొచ్చారు. మోకిలలో చదరపు గజానికి రూ.55 వేలు, బాచుపల్లిలో రూ.45 వేలు, ఇన్ముల్‌నర్వలో రూ.15 వేల అప్‌సెట్ ధర నిర్ణయించారు. ఈవేలానికి సంబంధించి రిజిస్ట్రేషన్, ఈఎండీ సమర్పణకు ఆగస్టు 31 చివరి గడువుగా నిర్ణయించారు. సెప్టెంబర్ 2న మోకిల, బాచుపల్లి లేఅవుట్లకు, సెప్టెంబర్ 3న ఇన్ముల్‌నర్వకు, సెప్టెంబర్ 9న కోకాపేట్ నియోపోలిస్ భూములకు బిడ్డింగ్ జరగనుంది. హెచ్ఎండీఏ అభివృద్ధి చేసిన ఈ లేఅవుట్లలో రహదారులు, డ్రైనేజీ, విద్యుత్ వంటి మౌలిక వసతులు అందుబాటులో ఉండటంతో వేలానికి మంచి స్పందన వస్తుందని అధికారులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా.. రాయదుర్గంలో యూనిటీ మాల్ నిర్మాణం కూడా హైదరాబాద్ ఐటీ కారిడార్‌కు మరో భారీ ప్రాజెక్టుగా నిలవనుంది. తెలంగాణతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల చేనేత, హస్తకళలు, కుటీర పరిశ్రమలు, వ్యవసాయ ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్ కల్పించే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును చేపడుతున్నారు. రాయదుర్గంలోని 6.12 ఎకరాల స్థలంలో సుమారు 27 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో రెండు భారీ ట్విన్ టవర్లను నిర్మించేందుకు రూ.2,059.81 కోట్ల అంచనా వ్యయంతో ప్రణాళిక రూపొందించారు.



సూర్యాపేటలో భారీ ట్రేడింగ్ మోసం

గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్-క్యూవీఎస్ఈ' పేరుతో రూ.లక్షల్లో టోకరా

దశ, సూర్యాపేట: జిల్లాలో 'గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ -క్యూవీఎస్ఈ' పేరుతో భారీ సైబర్ మోసం వెలుగులోకి వచ్చింది. రోజువారీ చెల్లింపులు, ఆకర్షణీయమైన కమిషన్ల పేరుతో గ్రామీణ ప్రజలను మోసగించినట్లు సమాచారం. యాప్‌లో చేరేందుకు రూ.50 వేల డిపాజిట్ చేయాలని, రోజుకు 5 డాలర్లు చెల్లిస్తామని నమ్మబలికినట్లు తెలుస్తోంది. కొత్త సభ్యుడిని చేర్పిస్తే రూ.7,500 కమిషన్ ఇస్తామని చెప్పడంతో పలువురు దళారులుగా మారి పెద్ద సంఖ్యలో సభ్యులను చేర్పించినట్లు సమాచారం. ఇప్పటివరకు 110 మంది బాధితులు మోసపోయినట్లు వెలుగులోకి రాగా, ఒక్క నూతనకల్ గ్రామం నుంచే సుమారు రూ.30 లక్షలు సైబర్ నేరగాళ్ల ఖాతాల్లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ రాబడి వస్తుందనే మాటలను నమ్మి మోసపోవద్దని సూర్యాపేట ఎస్పీ నరసింహ ప్రజలను హెచ్చరించారు.

కేబీఆర్ పార్క్ చుట్టూ వన్‌వే సక్సెస్

మొదటి పేజీ తరువాయి

నిర్ణయించారు.

నాగార్జున సర్కిల్ –జూబ్లీ చెక్‌పోస్టు వరకు ఫ్లైఓవర్

కేబీఆర్ పార్క్ చుట్టూ పాత ప్రాజెక్టులను రద్దు చేసినప్పటికీ, ట్రాఫిక్ రద్దీని మరింత తగ్గించేందుకు కొత్త ప్రత్యామ్నాయ ప్రణాళికను జీహెచ్ఎంసీ సిద్ధం చేస్తోంది. నాగార్జున సర్కిల్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వరకు ఆరు వరుసల స్టీల్ బ్రిడ్జి నిర్మించనున్నట్లు కమిషనర్ వెల్లడించారు. ఈ ఫ్లైఓవర్‌ను ఏడాది కాలంలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కొత్త కారిడార్‌తో పంజాగుట్ట, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాల మధ్య వాహనాల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. సిగ్నళ్ల వద్ద వాహనాల నిలిచిపోవడాన్ని తగ్గించి, నిరంతర రాకపోకలకు వీలు కల్పించడమే కొత్త ప్రణాళిక ప్రధాన ఉద్దేశంగా అధికారులు చెబుతున్నారు. భారీగా కూడళ్లను మార్చడం కంటే ఇప్పటికే సత్ఫలితాలు ఇస్తున్న వన్‌వే విధానంతో పాటు అవసరమైన చోట ఫ్లైఓవర్ నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది.

డెరివేటివ్‌లకు సీఏఎస్ విధానాన్ని ఏడాది పాటు నిలిపివేసే అవకాశం!

డెరివేటివ్‌ల సెటిల్‌మెంట్ ధరలను లెక్కించడానికి క్లోజింగ్ ఆక్షన్ విధానాన్ని (సీఏఎస్) ఉపయోగించడాన్ని సెబీ కనీసం ఒక సంవత్సరం పాటు నిలిపి వేసే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. ఫ్యూచర్స్, ఆప్షన్స్ విభాగంలో ఉన్న కంపెనీల షేర్ల ముగింపు ధర నిర్ణయించేందుకు సీఏఎస్ విధానాన్ని సెబీ ఆగస్టులో తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఈ విధానాన్ని పాక్షికంగా ఉపసంహరించుకోనుందని ఆ వర్గాలు తెలిపాయి. యూఎస్, హాంగ్‌కాంగ్ సహా ప్రపంచ మార్కెట్లలో ఉపయోగించే పద్ధతిని పోలిన సీఏఎస్ విధానం, ఎక్స్‌పైరీ రోజుల్లో డెరివేటివ్ ధరల్లో తీవ్రమైన హెచ్చుతగ్గులకు దారితీస్తోంది. దీంతో ఈ విధానాన్ని సమీక్షించేందుకు అభిప్రాయాలు కోరగా, 20,000కి పైగా సూచనలు అందినట్లు సెబీ వెల్లడించింది. వీటిని పరిశీలించి త్వరలోనే సర్క్యులర్ జారీ చేయనుంది. సీఏఎస్‌కు బదులు డెరివేటివ్ ధరను నిర్ణయించడాని,□ ట్రేడింగ్‌లోని చివరి 30 నిమిషాల వ్యాల్యూమ్ వెయిటెడ్ సగటు ధరను పరిగణనలోకి తీసుకోనున్నారని విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఓ ఆంగ్ల వెబ్‌సైట్ తెలిపింది. తక్కువ లిక్విడిటీ ఉన్న క్యాష్ మార్కెట్‌లోని అండర్‌లేయింగ్ స్టాక్స్ కోసం, రోజులో ముగింపు ధరను నిర్ణయించడానికి క్లోజింగ్ ఆక్షన్ విధానాన్నే ఉపయోగిస్తారని పేర్కొంది. ఈ నెలాఖరుకు ఈ మార్పులను సెబీ అమలు చేసే అవకాశం ఉందని పేర్కొంది. దీనిపై స్పందించేందుకు సెబీ ప్రతినిధి నిరాకరించారు.

ఒకే దరఖాస్తుతో పలు రాష్ట్రాల్లో జీఎస్‌టీ రిజిస్ట్రేషన్

వచ్చే సమావేశంలో పరిశీలించనున్న మండలి

దిల్లీ: వ్యాపారం చేయడాన్ని సులభతరం చేసేందుకు జీఎస్‌టీ మండలి మరో కీలక సంస్కరణకు సిద్ధమవుతోంది. వ్యాపార సంస్థలు ఒకే దరఖాస్తు ప్రక్రియ ద్వారా ఏకకాలంలో పలు రాష్ట్రాల్లో జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ పొందేలా కొత్త సౌలభ్యాన్ని తీసుకురానుంది. ఈ నెల 8న జరగనున్న మండలి సమావేశంలో 'పెద్ద వ్యాపార సంస్థల కోసం మార్పులు చేసిన సరళతర రిజిస్ట్రేషన్ ఫారమ్'పై చర్చించి, ఆమోదం తెలిపే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం దేశంలో జీఎస్‌టీ కింద నమోదైన సంస్థలు 1.68 కోట్లకు పైగా ఉన్నాయి. ఒక సంస్థ ఒక రాష్ట్రంలో ఇచ్చిన వ్యాపార వివరాలను.. ఇతర రాష్ట్రాల రిజిస్ట్రేషన్ దరఖాస్తుల కోసం సిస్టమ్ ఆటోమేటిక్‌గా తీసుకుంటోంది. పలు రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ కోరే వ్యాపారాలు, అన్నింటికీ కలిపి ఒకేసారి దరఖాస్తును పూర్తిచేయొచ్చు. దరఖాస్తుదారులు ఇచ్చే లొకేషన్ ఆధారంగా, సంబంధిత ట్యాక్స్ ఆఫీస్ పరిధిని జీఎస్‌టీ బ్యాక్‌ఎండ్ వ్యవస్థ నిర్ణయిస్తుంది. చట్టబద్ధంగా రాష్ట్రాల వారీగా ప్రత్యేక జీఎస్‌టీ నంబర్లు కొనసాగుతాయి. అయితే దరఖాస్తు ప్రక్రియను కేంద్రీకృత సాంకేతిక వేదికపైకి తీసుకురావడం వల్ల వ్యాపారులకు డూప్లికేషన్, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే శ్రమ, సమయం ఆదా అవుతాయని ఏఎంఆర్‌జీ గ్లోబల్ మేనేజింగ్ పార్టనర్ రజత్ మోహన్ తెలిపారు.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com